# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 25 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4




## కబడ్డీ ప్రపంచ కప్ విజేత భారత్

- 35-28 తేడాతో చైనీస్ తైపీపై విజయం
- వరుసగా రెండో ప్రపంచకప్

# దిగ్గజ నటుడు ధర్మేంద్ర ఇకలేరు

- **శోకసంద్రంలో బాలీవుడ్**

**బలగం టీవీ, ముంబై**

బాలీవుడ్ సినీ చరిత్రలో చెరగని ముద్ర వేసిన దిగ్గజ నటుడు ధర్మేంద్ర (89) సోమవారం (నవంబర్ 24, 2025) తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబైలోని తన నివాసంలో కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు.



'హీ-మ్యాన్ ఆఫ్ బాలీవుడ్'గా అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ధర్మేంద్ర మరణంతో సినీ పరిశ్రమలో ఒక శకం ముగిసినట్లైంది. దాదాపు ఆరు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో ఆయన 300లకు పైగా చిత్రాల్లో నటించి, యాక్షన్ హీరోగా, రొమాంటిక్ స్టార్‌గా ఎనలేని కీర్తిని సంపాదించారు. 'షోలే', సీతా ఔర్ గీతా', 'చుప్కే చుప్కే', 'యాదోన్ కీ బారాత్', 'ధరమ్ వీర్' వంటి ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలలో ఆయన నటన ప్రేక్షకుల మదిలో శాశ్వతంగా నిలిచిపోయింది. వృద్ధాప్య సమస్యలు, తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందులతో ఇటీవల ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందారు. డిశ్చార్జ్ అయిన కొద్ది రోజులకే ఆయన ఆరోగ్యం విషమించడంతో ఈ విషాదం చోటుచేసుకుంది.

ధర్మేంద్ర అసలు పేరు ధరమ్ సింగ్ డియోల్. నటుడిగానే కాకుండా నిర్మాతగా, రాజకీయ నాయకుడిగా కూడా ఆయన సేవలు అందించారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన కృషికి గాను కేంద్ర ప్రభుత్వం 2012లో పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. ధర్మేంద్ర మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్



- **53వ చీఫ్ జస్టిస్‌గా పదవిలో 15 నెలలు..**
- **ఆదివారం పదవీ విరమణ చేసిన జస్టిస్ గవాయ్..**

**బలగం టీవీ, న్యూఢిల్లీ:**

భారత సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) 53వ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం (నవంబర్ 24, 2025) ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు ప్రస్తుత చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ఆదివారం సాయంత్రం పదవీ విరమణ చేయడంతో జస్టిస్ సూర్యకాంత్ ఈ బాధ్యతలు చేపట్టారు.

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ఆదివారం సాయంత్రం పదవీ విరమణ చేశారు. జస్టిస్ సూర్యకాంత్ అక్టోబర్ 30న 53వ సీజేఐగా నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో 15 నెలలపాటు కొనసాగనున్నారు. 2027 ఫిబ్రవరి 9న ఆయన రిటైర్ కానున్నారు. జస్టిస్ సూర్యకాంత్ హర్యానాలోని హిసార్ జిల్లాలో 1962 ఫిబ్రవరి 10న ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. హిసార్?లో 1984లో లాయర్?గా ప్రాక్టీస్ మొదలుపెట్టిన ఆయన అంచెలంచెలుగా సీజేఐ స్థాయికి ఎదిగారు. సుప్రీంకోర్టు జడ్జిగా తన కెరీర్?లో ఆయన చరిత్రాత్మకమైన తీర్పులు ఇచ్చారు. ఆర్టికల్ 370 రద్దు తీర్పును ఇచ్చిన రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్? సభ్యుడిగా ఉన్నారు.

### 3 రాష్ట్రాల ముఖ్యమంత్రులకు

# మావోయిస్టుల సంచలన లేఖ

- **సామూహిక లొంగుబాటుకు సిద్ధం..**
- **ఫిబ్రవరి 15, 2026వ తేదీ వరకు తమకు సమయం ఇవ్వాలని కోరిన మావోయిస్టులు**

**బలగం టీవీ, హైదరాబాద్**

తమ పోరాటాన్ని విరమించుకుని, ఆయుధాలు వీడి సాధారణ జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు సంచలన ప్రకటన చేశారు. ఈ మేరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు మావోయిస్టు ప్రతినిధి పేరుతో ఓ కీలక లేఖను విడుదల చేశారు.

ఆయుధ విరమణపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్న మావోయిస్టులు, ఇందుకు ఒక ప్రధాన షరతును విధించారు. ప్రస్తుతం ఈ మూడు రాష్ట్రాల్లో 'ఆపరేషన్ కగార్' లో భాగంగా భద్రతా దళాలు నిర్వహిస్తున్న కూంబింగ్ ఆపరేషన్లను పూర్తిగా నిలిపివేయాలని కోరారు. ప్రభుత్వాలు కూంబింగ్ ఆపరేషన్ ఆపితే, తాము వెంటనే ఆయుధ విరమణ తేదీని ప్రకటిస్తామని లేఖలో స్పష్టం చేశారు. తమ నిర్ణయాన్ని పార్టీ అంతర్గతంగా చర్చించుకుని, తమ సహచరులకు సందేశాలు చేరవేసేందుకు వీలుగా ఫిబ్రవరి 15, 2026వ తేదీ వరకు తమకు సమయం ఇవ్వాలని మావోయిస్టులు ప్రభుత్వాలను అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ అభ్యర్థనను మన్నించి, కూంబింగ్ ఆపరేషన్‌ను నిలిపివేస్తే, ఎంఎంసీ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ స్పెషల్ జోనల్ కమిటీ పరిధిలోని మావోయిస్టులందరూ సామూహికంగా లొంగిపోతామని ఈ లేఖలో ప్రకటించడం గమనార్హం. ఈ లేఖలో, కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ సోను దాదా తీసుకున్న 'పోరాటం నిలిపివేయాలన్న' నిర్ణయానికి తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఆయుధాలు విడిచిపెట్టి, ప్రభుత్వాలు అందించే పునరావాస పథకాలను పొందాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

# బీసీలకు కాంగ్రెస్ ద్రోహం



- **తెలంగాణ బీసీలకు రాహుల్ గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతాం.**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ద్రోహం పైన ఆ పార్టీ తీరును ఎండగడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి, అడుగడుగునా బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తామన్నారు. తెలంగాణ బీసీలకు కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతామన్నారు. తెలంగాణలో ఎలాంటి రిజర్వేషన్ల పెంపు జరగకముందే 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు తెలంగాణలో ఇచ్చినట్లు దేశవ్యాప్తంగా చెప్పుకుంటూ తిరుగుతున్న రాహుల్ గాంధీ చేస్తున్న మోసాన్ని దేశ ప్రజల ముందు ఉంచుతామన్నారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే లోక్‌సభలో అపోజిషన్ లీడర్‌గా ఉన్న ఆయన వెంటనే ఈ అంశం పైన పార్లమెంటులో చర్చకు వచ్చేలా చూడాలన్నారు. ఒకవేళ కేంద్రంలోని బీజేపీ సహకరించకుంటే రాహుల్ గాంధీ ఎందుకు ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తరు అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి నిజంగానే బీసీల పైన, 42 శాతం రిజర్వేషన్ల అంశం పైన చిత్తశుద్ధి ఉంటే ప్రైవేట్ మెంబర్ బిల్లు సైతం ప్రవేశపెట్టవచ్చు కదా అని కేటీఆర్ ప్రశ్నించారు.

ఈ అంశంపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ నుంచి ఎన్నికై ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు లోక్‌సభలో గళం లేవనెత్తాలన్నారు. బీజేపీ పదేపదే బీసీల మాట చెబుతుంది కానీ వారికి రిజర్వేషన్ల నుంచి మొదలుకొని నిధుల అమలు దాకా, ఓబీసీ సంక్షేమ శాఖ వరకు అన్ని అంశాల్లో ద్రోహం చేస్తున్నదని, బీజేపీ చేస్తున్న మోసాన్ని సైతం ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు.స్థానిక సంస్థల రిజర్వేషన్ల చుట్టే మొత్తం అంశాన్ని తిప్పుతూ, కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చే విద్య, ఉపాధి, ప్రభుత్వ కాంట్రాక్టులలో 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే అంశాన్ని పక్కన పెట్టిందన్నారు. దీంతోపాటు బీసీలకు బడ్జెట్‌లో సంవత్సరానికి ?20,000 కోట్ల రూపాయలు కేటాయిస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. వచ్చే బడ్జెట్‌లో 20వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించేలా కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తీసుకువస్తామని కేటీఆర్ తెలిపారు. బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల రిజర్వేషన్లతో పాటు బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేస్తున్న మోసాన్ని గ్రామ స్థాయి వరకు వివిధ రూపాల్లో తీసుకువెళ్లాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణ పైన కేటీఆర్ పలు సూచనలు చేశారు.

### సర్పంచ్ ఎన్నికలకు

# రెండు, మూడ్రోజుల్లో నోటిఫికేషన్

- **స్థానిక సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించేవారినే సర్పంచులుగా ఎన్నుకోవాలి**
- **అభివృద్ధి నిరోధకులను ఎన్నికల్లో ఓడించాలి**
- **దేశంలోనే ఒక ఆదర్శవంతమైన శాసనసభ నియోజకవర్గంగా కొడంగల్‌ను తీర్చిదిద్దుకుందాం**
- **అభివృద్ధి నిరోధకులను ఎన్నికల్లో ఓడించాలి**
- **కొడంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి**
- **రూ.103 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**
- **హరే కృష్ణ ఫౌండేషన్ మిడ్ డే మీల్స్ కిచెన్ షెడ్‌కు భూమి పూజ**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సర్పంచ్ ఎన్నికలకు రెండు, మూడ్రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందనే సమాచారం ఉన్నదని సీఎం ఏ రేవంత్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లో బడి, గుడి, తాగడానికి మంచినీరు, ఇందిరమ్మ ఇండ్లు సహా స్థానిక సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించేవారినే సర్పంచులుగా ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి నిరోధకులను ఎన్నికల్లో ఓడించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమైందని చెప్పారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి కూడా సర్పంచ్‌లే కీలకమన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారే వారధులుగా నిలుస్తారని తెలిపారు. సోమవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరితో కలిసి సీఎం పర్యటించారు. కొడంగల్ నియోజకవర్గంలో రూ.103 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ 2034 నాటికి దేశంలోనే ఒక ఆదర్శవంతమైన శాసనసభ నియోజకవర్గంగా కొడంగల్‌ను తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గడిచిన 70 ఏండ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం వచ్చిందని, దేశం నలుమూలల నుంచి ఇక్కడికొచ్చి చూసేలా అభివృద్ధి చేసుకుని ఆదర్శవంతంగా నిలబెడుదామని చెప్పారు.ముఖ్యమంత్రి కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించారు. కొడంగల్‌లో హరేకృష్ణ సంస్థ వారి ఆధునిక అల్పాహార వంటశాల (సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్)ను పరిశీలించారు. అనంతరం అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిడ్ డే కిచెన్ భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఇదే సందర్భంగా నియోజకవర్గంలో రూ. 103 కోట్లతో వివిధ అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన చేసి సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్దిదారులకు చెక్కులు, చీరలను పంపిణీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తూ కొండగల్‌ను ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి సంబంధించి ప్రణాళికలను ఆవిష్కరించారు.

ఆడబిడ్డలు సంతోషంగా, ప్రశాంతంగా ఉంటేనే రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధిస్తుందన్న విశ్వాసంతోనే వారిని ఆదుకోవడానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రధానమైన విద్య, నీటి పారుదల రంగం అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అందుకు కొడంగల్ ఒక ప్రయోగశాలగా ఎంచుకున్నాం.ఇంట్లో అమ్మ ఏ విధంగా ఆలోచన చేస్తుందో, అదే విధంగా అక్షయపాత్ర సహకారంతో నియోజకవర్గంలోని 312 పాఠశాలల్లో చదువుకుంటున్న 28 వేల మంది విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం అల్పాహారం పెడుతున్నాం. ఏ ఒక్క విద్యార్థి ఆకలితో బాధ పడకూడదు. ఆకలితో చదువుపై శ్రద్ధ కోల్పోవద్దని విద్యార్థులకు ఆల్పాహారం పెట్టాలని నిర్ణయించాం. మధ్యాహ్న భోజన పథకం కూడా ప్రవేశపెడుతున్నాం.

కొడంగల్ నియోజకవర్గాన్ని ఒక ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చుతున్నాం. మెడికల్ కాలేజీ, వెటర్నరీ, వ్యవసాయ కాలేజీ, పారా మెడికల్, నర్సింగ్ కాలేజీ, ఫిజియో థెరఫీ, ఇంజనీరింగ్ కాలేజీ, ఏటీసీ, జూనియర్, డిగ్రీ కాలేజీలతో పాటు రాష్ట్రంలో ఇప్పటివరకు లేని సైనిక్ స్కూల్‌ను కొడంగల్‌లో ప్రారంభించుకోబోతున్నాం. రేపటి తెలంగాణ పునర్నిర్మాణంలో కొడంగల్ పిల్లలను భాగస్వామ్యం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. 5 వేల కోట్ల రూపాయలతో ఎడ్యుకేషన్ క్యాంపస్‌ను నిర్మించుకుంటున్నాం. గొప్ప చదువు చదవాలంటే కొడంగల్ వెళ్లే విధంగా తీర్చిదిద్దాలని క్యాంపస్‌ను నిర్మిస్తున్నాం. 16 నెలలు తిరిగే లోపు అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తున్నాం.కరువు ప్రాంతంగా ఉన్న కొడంగల్, మక్తల్, నారాయణపేట ప్రాంతాలను కృష్ణా నదీ జలాలతో తడపాలని, ప్రతి ఎకరాకు నీరివ్వాలని, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రారంభించుకోవడమే కాకుండా దాదాపు 5 వేల కోట్ల రూపాయలతో ప్రతి ఎకరాకు నీరివ్వాలని సంకల్పించాం.

భూ సేకరణ విషయంలో 95 శాతం రైతులు స్వతంత్రంగా ముందుకొచ్చి ప్రాజెక్టులు కట్టాలని భూములిచ్చారు. రేపు మంత్రివర్గంలో ఆమోదం పొందితే మూడు నెలల్లో పనులు ప్రారంభమవుతాయి. రైతులు అడిగిన ఇండ్లు, నష్టపరిహారం ఇచ్చాం. లగచర్ల, హకీంపేట, పోలెపల్లి ప్రాంతంలో రైతులు ముందుకొచ్చి ఇస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలను స్థాపించి లగచర్ల పారిశ్రామిక వాడను అభివృద్ధి చేస్తున్నాం. కొడంగల్ ఒక గొప్ప పారిశ్రామిక కేంద్రంగా, దేశ రాజధాని ఢిల్లీ పక్కన నొయిడా అభివృద్ధి చెందినట్టుగా, తెలంగాణ నొయిడాగా తీర్చిదిద్ది కొడంగల్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తాం. ఇక్కడి పిల్లలకు విద్యతో పాటు పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించే ప్రణాళికలు చేస్తున్నాం. ఇక్కడ పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే రైల్వే లైన్ కావాలి. అందుకే వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ (వికారాబాద్, పరిగి కొడంగల్ నారాయణపేట్, మక్తల్) నుంచి కర్నాకట రాష్ట్రానికి రైలు మార్గం కోసం కేంద్ర ప్రభుత్వ ఆమోదమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేశాం. 70 ఏండ్లుగా వత్తులేసుకుని ఎదురుచూస్తున్న రైల్వే లైను పనులు తొందరలోనే మొదలుపెట్టబోతున్నాం.

ఇక్కడ ఉన్న సున్నపు గునులను దృష్టిలో పెట్టుకుని కొడంగల్ మండలంలో తొందరలోనే సిమెంట్ పరిశ్రమను పెట్టి ఇక్కడ ఉద్యోగాలు కల్పించబోతున్నాం. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు పంపిణీ చేయడానికి కోటి చీరెలను సారెగా నాణ్యత కలిగిన చీరలను అందిస్తున్నాం. ప్రతి ఆడబిడ్డకు చీర అందాలి. ప్రతి ఆడబిడ్డ ఇంటికెళ్లి చీర అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

గ్రామాల్లో బడి, గుడి, తాగడానికి మంచినీరు, ఇందిరమ్మ ఇండ్లు.. కావాలి. ఇలాంటి పనులు చేయాలంటే రాబోయే సర్పంచు ఎన్నికల్లో మంచి వారిని గెలిపించుకోవాలి.. అని ముఖ్యమంత్రి గారు పిలుపునిచ్చారు.నియోజకవర్గంలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని 300 కోట్ల రూపాయల చెక్కును అందించారు. అంతకుముందు మహిళా శక్తి పథకంలో భాగంగా మద్దూరు మండల మహిళా సమాఖ్య సౌజన్యంతో నడపనున్న బస్సుకు ముఖ్యమంత్రి గారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు దామోదర రాజనర్సింహ గారు, వాకిటి శ్రీహరి గారు, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## కోకాపేటలో ఎకరం రూ.137.25 కోట్లు

**బలగం టీవీ, హైదరాబాద్**



హెచ్ఎమ్‌డీఏ ఆధ్వర్యంలో చేపట్టిన నియోపోలీస్ ఈ - ఆక్షన్‌కు భారీ స్పందన వచ్చింది. అధికారులు సైతం ఊహించని విధంగా ఎకరం రూ.137. 25కోట్లు పలికింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మొదటి దశలో భాగంగా మొత్తం రెండు ప్లాట్లు.. 10.30 ఎకరాలకు వేలం నిర్వహించారు. ప్లాట్ 17లో 4.59 ఎకరాలు, ప్లాట్ 18లో 5.31 ఎకరాలను ఈ ఆక్షన్‌లో పెట్టారు. ఈ వేలంలో 10 ప్రముఖ కంపెనీలు పోటీ పడ్డాయి. ఇందులో ఒక ఎకరం రూ.137.25కోట్లు పలికింది. మొత్తం రెండు ప్లాట్లు 10.30 ఎకరాలకుగాను ప్రభుత్వానికి రూ.1,356 కోట్ల ఆదాయం వచ్చింది. గతంతో పోల్చి చూస్తే 87శాతం పెరిగింది. 2023లో జరిగిన నియోపోలీస్ ఆక్షన్లలో సగటు ధర ఎకరాకు సుమారు రూ.73 కోట్లు పలికింది. ఈ సారి ఎకరం రూ.137.25కోట్లు పలికింది. ప్లాట్ 18ని ఎమ్ఎస్ఎన్ అర్బన్ వెంచర్స్ సొంతం చేసుకోగా, ప్లాట్ 17ను వజ్రా హౌసింగ్ ప్రాజెక్ట్స్ సొంతం చేసుకుంది. సోమవారం ఉదయం 11 గంటల నుంచి 2గంటల వరకు జరగాల్సిన వేలం.. పోటీ ఎక్కువగా ఉండటంతో సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది.

### గౌరవెల్లి సహా

# ఇతర ప్రాజెక్టులకు త్వరగా అనుమతులివ్వండి



- **కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల కార్యదర్శికి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో గౌరవెల్లి సహా.. ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టులకు త్వరగా పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సోమవారం నాడిక్కడ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల కార్యదర్శి తన్మయి కుమార్‌ను ఆయన కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న నీటిపారుదల ప్రాజెక్టులు, వాటికి సంబంధించిన అనుమతులపై చర్చించారు. సుప్రీంకోర్టు ధర్మాసనం 2025 మేలో ఇచ్చిన 'వనశక్తి' తీర్పును ఇటీవల వెనక్కి తీసుకుందని తెలిపారు. దీనిపై న్యాయసలహా తీసుకొని, అనుమతుల మంజూరు చేస్తామని తన్మయి కుమార్ తెలిపినట్లు మంత్రి వివరించారు. ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేస్తే, ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించే అవకాశాలు పెరుగుతాయని కార్యదర్శికి వివరించినట్టు మంత్రి తెలిపారు. కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ విదేశాల్లో ఉన్న కారణంగా తన్మయికుమార్‌ను కలిసి, ప్రాజెక్టుల అనుమతుల గురించి చర్చించినట్టు తెలిపారు. మంత్రి వెంట సెక్రెటరీ కోఆర్డినేషన్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.



## ఓఆర్ఆర్‌పై కారులో మంటలు.. వ్యక్తి సజీవ దహనం

**బలగం టీవీ, హైదరాబాద్**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై విషాద ఘటన జరిగింది. కారులో మంటలు చెలరేగడంతో ఓ వ్యక్తి సజీవ దహనమయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం జైగిరి గ్రామానికి చెందిన తల్లపల్లి దుర్గాప్రసాద్(30) ఈ69 డిజిటల్ న్యూస్ ఛానల్ పార్ట్‌నర్. ఆదివారం వృత్తి పని మీద హైదరాబాద్‌కు వెళ్లి రాత్రి మియాపూర్‌లో బంధువుల ఇంట్లో ఉండి సోమవారం తెల్లవారుజామున సుమారు 4:30 గంటలకు కారులో బయలు దేరాడు. ఓఆర్ఆర్‌పై శామీర్‌పేట దాటి కీసర వైపు వెళ్తున్న దారిలో వాహనా న్ని రోడ్డుకు ఓవైపున ఆపి పడుకున్నట్టు అనుమానం వ్యక్తమవుతోంది. అయితే, ఉదయం 6 గంటల సమయంలో డయల్-100 ద్వారా శామీర్ పేట పోలీసులకు ఓఆర్ఆర్‌పై ఒక కారు అగ్నికి ఆహుతవుతోందని సమా చారం అందింది. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా.. అప్పటికే కారు పూర్తిగా మంటల్లో కాలిపోతోంది. ఫైర్ ఇంజిన్ మంటలను ఆర్పేసింది. డ్రైవర్ సీటులో ఉన్న వ్యక్తి పూర్తిగా సజీవ దహనమై.. మృతదేహం అస్థి పంజరంలా మారింది. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరిం చింది. ప్రాథమిక విచారణలో భాగంగా.. మంటల్లో కాలిపోయిన ఆ కారు ఫోర్డ్ ఎకోస్పోర్ట్, రిజిస్ట్రేషన్ నెం:టీఎస్03 ఎఫ్‌డీగా 7688గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తు న్నట్టు శామీర్‌పేట ఎస్‌హెచ్ఓ శ్రీనాథ్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో స్పష్టమవుతాయని పోలీసులు చెప్పారు.

# ముగిసిన ఐ బొమ్మ రవి పోలీసు కస్టడీ

**బలగం టీవీ, హైదరాబాద్**

సినిమాల పైరసీ కేసులో అరెస్టయిన ఇమ్మడి రవి (అలియాస్ ఐ బొమ్మ రవి) పోలీసు కస్టడీ సోమవారంతో ముగిసింది. 5 రోజుల కస్టడీలో సైబర్ క్రైమ్ పోలీసులు అతని నుంచి కీలక సమాచారం రాబట్టారు. నిందితుడిని నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసులు తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఐబొమ్మ రవి ఒక్కడే పైరసీ చేశాడని, దాదాపు రూ.100 కోట్లకుపైగా సంపాదించాడని పోలీసులు అంచనాకు వచ్చినట్టు తెలిసింది. ఇందులో రూ.30 కోట్లకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలను ఇప్పటికే సేకరించారు. మూవీపై క్లిక్ చేయగానే దాదాపు 15 నుంచి 20 యాడ్స్‌కు డైరెక్ట్ లింక్ అయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేయడంతో భారీగా లాభాలొచ్చాయని తెలిసింది. రవి ఐదు రోజుల కస్టడీలో వెబ్‌సైట్, డొమైన్ నెట్‌వర్క్, ఐపీమాస్క్ తదితర అంశాలపై పోలీసులు ఆరా తీసినట్టు సమాచారం. రవి, అతని స్నేహితుడు ఇద్దరూ కలిసి టెక్నికల్ ఆపరేషన్స్, డేటా హైడింగ్, సర్వర్ యాక్సెస్ తదితర అంశాల్లో పాల్గొన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. బెట్టింగ్ యాప్‌తోపాటు ఇతర యాప్‌ల ద్వారా భారీగా డబ్బులు సంపాదించిన రవి వివిధ బ్యాంకుల్లో రూ.20 కోట్ల బదిలీ చేయించుకున్నాడు. లావాదేవీలపై బ్యాంక్ అధికారుల సహకారంతో వివరాలు తెప్పించుకున్న పోలీసులు ఆ దిశగా రవిని ప్రశ్నించినట్టు తెలిసింది. వచ్చిన డాలర్లను క్రిప్టో కరెన్సీ ద్వారా నిఖిల్ అనే తన స్నేహితుడికి పంపినట్టు గుర్తించారు. ఇదిలావుండగా పోలీసులు అడిగిన ప్రశ్నలకు అన్నీ తానొక్కడినే చేశానని, తన వెనుక ఎవరూ లేరని రవి సమాధానం చెప్పినట్టు తెలుస్తోంది. మరోసారి రవిని కస్టడీకి తీసుకుని మరిన్ని పూర్తి వివరాలు రాబట్టేందుకు కోర్టులో పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి మంగళవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ సమావేశం నిర్వహించనున్నారు.

## నేను రాజీనామా చేయడం లేదు

- **ఎమ్మెల్యే కడియం ఆసక్తికర వ్యాఖ్యలు**

**బలగం టీవీ, జనగామ**

"నేను రాజీనామా చేయడం లేదు" స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో.. ఆ తర్వాత తన కార్యాచరణ, ప్రణాళిక ఉంటుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 23లోపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ సభాపతి నుంచి తనకు నోటీసులు అందినట్టు కడియం తెలిపారు. వివరణ ఇచ్చేందుకు సమయం కోరగా స్పీకర్ సానుకూలంగా స్పందించారని అన్నారు. ఇదిలావుండగా, తాను తీసుకునే ఏ నిర్ణయమైనా నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో, ప్రజలందరి సహకారం ఉన్నదని స్పష్టం చేశారు. రోజుకు అనేక అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని, ఇదే తరహాలో పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండి.. సర్పంచ్ ఎన్నికల్లో ప్రతి గ్రామపంచాయతీపై కాంగ్రెస్ జెండా ఎగరేయాలని సూచించారు. గ్రామాలలో సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలంటే కాం గ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. ఏకగ్రీవమైతే రూ.10లక్షలు, ఒకవేళ గ్రామంలో ఒకేతాటిపై నిలిచి పార్టీలకతీతంగా సర్పంచ్‌గా ఒకరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నా.. అదనంగా తన సొంతంగా రూ.15లక్షలు కలి పి రూ.25లక్షలు గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.

# పంచాయతీ ఎన్నికలు నిర్వహించండి

- స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ
- జిల్లాల వారీగా రిజర్వేషన్ల గెజిట్లు సర్కార్‌కు సమర్పించిన కలెక్టర్లు
- హైకోర్టు విచారణ నేటికి వాయిదా
- తేలని 27 జీపీల ఎన్నికల పంచాయితీ




**బలగం టీవీ, హైదరాబాద్**

పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు సోమవారం లేఖ రాసింది. రిజర్వేషన్ల ప్రక్రియ వివరాలను సమర్పించిన ప్రభుత్వం ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపింది. అన్ని జిల్లాల కలెక్టర్లు సమర్పించిన సర్పంచ్, వార్డు సభ్యుల గెజిట్‌లను ప్రభుత్వం ఎస్ఈసీకి పంపింది. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. గత రెండు రోజులుగా దీనికి సంబంధించి తీవ్ర కసరత్తు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అన్ని రిజర్వేషన్లతోపాటు

లాటరీ విధానంలో మహిళా రిజర్వేషన్లను కూడా పూర్తి చేసింది. ప్రభుత్వ అభ్యర్థన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12,733 పంచాయతీల్లోని 1,12,288 వార్డుల్లో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. కాగా పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్ల పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరగాల్సింది. అయితే, ప్రధాన న్యాయమూర్తి సెలవులో ఉండటంతో విచారణ జరగలేదు. మంగళవారం విచారణ తర్వాత హైకోర్టు ఇచ్చే ఆదేశాలకనుగుణంగా నోటిఫికేషన్ జారీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా సిద్ధంగా ఉంది.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను రాష్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై ఆమె జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల్లో గుర్తించిన పోలింగ్ స్టేషన్ల వారీగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్స్‌ల తరలింపునకు సంబంధించి రవాణా తదితర అంశాలపై వారికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**27 జీపీల్లో ఎన్నికలు వాయిదా**

రాష్ట్రంలోని 27 పంచాయతీల్లో కోర్టు కేసులు, ఇతర వివాదాల వల్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. అందులో ములుగు జిల్లా మంగపేట మండలంలోని 25 గ్రామాలతో పాటు కరీంనగర్ జిల్లా వి.సైదాపూర్ మండలంలోని రెండు గ్రామాలు ఉన్నట్టు పంచాయతీ రాజ్ శాఖ అధికారులు తెలిపారు. మంగపేట మండలం: 1).కమలాపూర్ 2)నర్సాపూర్ బోరే 3).కొమటి పల్లి 4).కొత్తూరు మొట్ల గూడెం 5).చెరుపల్లి 6).బాలన్నగూడెం 7).నర్సాయిగూడెం, 8).బుచ్చంపేట, 9).తిమ్మంపేట 10).మంగపేట 11).మల్లూరు 12).కొత్త మల్లూరు 13).నర్సింహసాగర్, 14).పూరేడుపల్లి, 15).రమణక్కపేట, 16).చుంచు పల్లి 17).వడగూడెం, 18).రాజుపేట, 19).రామచంద్రునిపేట, 20).వాగొడ్డుగూడెం, 21).కోతిగూడెం, 22).బ్రహ్మణపల్లి, 23).అక్కినపల్లి మల్లారం, 24).దోమెడ, 25).నిమ్మనగూడెం. సైదాపూర్ మండలం: 1).కుర్మపల్లి, 2).రామచంద్రాపూర్

# వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందని భార్య హత్య..

**భర్తకు జీవిత ఖైదు**

**బలగం టీవీ, హన్వాడ**

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్య హత్య కేసులో నిందితుడు మిర్యాల రాములు (ఏ1) కు ప్రిన్సిపాల్ సెషన్స్ జడ్జి కల్యాణ్ చక్రవర్తి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించారు. వివాహేతర సంబంధం కారణంగా భార్యను క్రూరంగా హతమార్చినట్లు కోర్టు విచారణలో స్పష్టమైనందున ఏ1పై శిక్ష ఖరారైంది.

భర్త రాములు (ఏ1)– ఎరుకలీ మంగమ్మ (ఏ2) మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతున్నదని మృతురాలు మిర్యాల భీమమ్మ (46) తరచూ ఆక్షేపించేది. దీనిపై ఆగ్రహించిన ఏ1.. 25/26 జనవరి 2023 రాత్రి 1 గంట సమయంలో సైకిల్ హ్యాండిల్‌తో భార్య ఛాతీ, కడుపుపై తీవ్రంగా దాడి చేసి హతమార్చినట్లు దర్యాప్తులో బయటపడింది. హత్య అనంతరం రాములు, "మద్యం తాగి ఛాతి నొప్పితో మృతి చెందింది" అని గ్రామంలో అబద్ధ ప్రచారం చేశాడు.

వైద్యుల పోస్ట్‌మార్టం నివేదికలో "బ్లంట్ ఇంజరీ" వల్ల మరణమని తేలడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఏ1 ఇచ్చిన extra judicial confession, అతను చూపిన ప్రదేశంలో స్వాధీనం చేసుకున్న సైకిల్ కీలక ఆధారాలుగా నిలిచాయి. ఏ2 హత్యకు ప్రేరేపించినట్టు దర్నాప్తులో తేలింది.




**పోలీసు బృందాన్ని అభినందించిన ఎస్పీ జానకి**

ఈ కేసును విజయవంతంగా ఛేదించిన ఇన్వెస్టిగేషన్ బృందంలోని ఐఓలు కె.రవి, ఎస్ఐ అశోక్ సీఐపీ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుదర్శన్ రెడ్డి, కోర్టు డ్యూటీ అధికారి రాఘవేందర్, పీసీ 2195, లైజాన్ అధికారి ఎండి ఇరాన్, హెచ్‌జీ 231లను జిల్లా ఎస్పీ డి.జానకి ప్రత్యేకంగా అభినందించారు.

# వృత్తి విలువల పరిరక్షణకై నిరంతర కృషి అవసరం



**బలగం టీవీ, హైదరాబాద్**

పవిత్రమైన జర్నలిజం వృత్తి విలువలను పరిరక్షించేందుకు నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉంటుందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ అన్నారు.సోమవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, షాపూర్ లోని శుభం హోటల్ బాంక్వెట్ హాలులో జరిగిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ కమిటీ బాధ్యతల స్వీకరణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజ హితం కోసం పురుడుపోసుకున్న మీడియాను, జర్నలిజం పట్ల అవగాహన లేని కొందరు అప్రతిష్టపాలు చేసే చర్యలకు పాల్పడడం సహించరానిదన్నారు. స్వాతంత్ర పోరాటం నుండి మొదలుకొని, మరెన్నో చారిత్రాత్మక ఉద్యమాల్లో మీడియా గొప్ప పాత్రను పోషించిందని, ఎందరో పాత్రికేయులు నీతి, నిజాయితీ, నిర్భీతితో వారి వృత్తి ధర్మాన్ని నిర్వర్తించి సమాజానికి స్ఫూర్తిగా నిలిచారని ఆయన కొనియాడారు. అసలు సమాజంలో జర్నలిస్టులు ఎవరనే? చర్చ ప్రస్తుతం ప్రజల్లో విస్తృతంగా జరుగుతుందని, దీనికి కారణం నకిలీల బెడదా పెరిగిపోవడమేనని ఆయన తెలిపారు. సమాజం మేలును కాంక్షిస్తూ, విలువలతో కూడిన వృత్తి బాధ్యతలను నిర్వర్తించే వారే నిజమైన జర్నలిస్టులనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని విరాహత్ అలీ సూచించారు.

జర్నలిస్టుల సంక్షేమం కోసం డెబ్భై ఏళ్లుగా మడమతిప్పని పోరాటం చేస్తున్న తమ సంఘం, నాటి నుండి నేటివరకు అదే స్ఫూర్తి, నిబద్ధతతో పని చేస్తుందని ఆయన స్పష్టం చేసారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తప్పదని విరాహత్ అలీ అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డమీది బాల్ రాజ్, వెంకట్రాం రెడ్డిలతో పాటు కుత్బుల్లా పూర్ నియోజకవర్గంలో ప్రధాన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో పనిచేస్తున్న వంద మంది జర్నలిస్టులు హాజరయ్యారు.

**ఐడి కార్డుల పంపిణీ**

కుత్బుల్లా పూర్ నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు టీయూడబ్ల్యూజే యూనియన్ గుర్తింపు కార్డులను రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ చేతుల మీదుగా పంపిణీ చేసారు. అనంతరం ప్రెస్ క్లబ్ నూతన కమిటీ బాధ్యులను ఆయన సత్కరించారు.

# అమెరికా వీసా రద్దయిందని వైద్యురాలు ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**



అమెరికాలో వైద్య వృత్తిని కొనసాగించాలన్న కల భగ్నమవడంతో మనస్తాపం చెందిన ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఓ వైద్యురాలు హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాకు రోహిణి (38) అనే ఈ యువ వైద్యురాలు ఈ నెల 22న తన నివాసంలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నారు. కిర్గిస్థాన్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన రోహిణి, మూడేళ్ల క్రితం హెచ్–1బీ వీసాపై అమెరికా వెళ్లారు. అక్కడ ఒక ప్రముఖ ఆసుపత్రిలో ఉద్యోగం సంపాదించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. దీనికి సంబంధించిన మూడు దశల పరీక్షల్లో ఆమె అత్యుత్తమ మార్కులు సాధించారు. అంతేకాక, మూడుసార్లు అబ్జర్వర్‌షిప్ పూర్తి చేసి, ప్రతిష్టాత్మకమైన రెసిడెన్సీ ప్రోగ్రామ్‌కు సైతం ఎంపికయ్యారు.

అయితే, గత మే నెలలో కుటుంబసభ్యులను చూసేందుకు రోహిణి భారత్‌కు వచ్చారు. ఆమె తిరిగి వెళ్లాలనుకునే సమయానికి, అమెరికా వీసాల జారీలో నిబంధనలు కఠినతరం కావడంతో సమస్య ఎదురైంది. ఆమె తన ప్రస్తుత హెచ్–1బీ వీసాను జే–1 వీసాగా అప్‌గ్రేడ్ చేసుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారు. కానీ, అమెరికా ప్రభుత్వం ఆమె దరఖాస్తును తిరస్కరించింది. దీంతో, అమెరికాలో తన భవిష్యత్తు అంధకారంలో పడిందన్న తీవ్ర మనస్తాపానికి లోనైన రోహిణి, ఈ నెల 22న హైదరాబాద్‌లోని తన నివాసంలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె మరణంతో గుంటూరుతో పాటు కుటుంబ సభ్యుల్లో విషాదం నెలకొంది. అంతర్జాతీయంగా వైద్య వృత్తిలో రాణించాలనుకున్న ఒక ప్రతిభావంతురాలి కల, వీసా నిబంధనల కారణంగా అర్థాంతరంగా ముగిసిపోవడం పట్ల పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు.

# టిప్పర్ నిర్లక్ష్యంగా నడిపిన వ్యక్తిపై కేసు.. రిమాండ్ కు తరలింపు

- ఎస్ఐ రామాకాంత్

**బలగం, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామ చౌరస్తా వద్ద శనివారం ఉదయం 08:30 గంటలకు గంగాధర మండలం ఒద్యారం గ్రామానికి చెందిన బాలసంకుల గిరిధర్ తన హోండా పాషన్ ప్రోపై వెళ్తుండగా,సమీపంలోని బ్రిడ్జ్ వద్దకు రాగానే టిప్పర్ డ్రైవర్ దిలీప్ తాతెరావు భగత్ తన వాహనాన్ని అధిక వేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల గిరిధర్‌ను వెనక వైపు నుండి ఢీకొట్టగా అతను కిందపడిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, కేసు దర్యాప్తు లో భాగంగా నిందితుడు టిప్పర్ డ్రైవర్ దిలీప్ తాతెరావు భగత్ ని సోమవారం రోజున అరెస్ట్ చేసి, న్యాయస్థానానికి రిమాండ్ కు పంపినట్లు బోయినిపల్లి మండల ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

# జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా శేషాద్రిని రెడ్డి

- బాధ్యతల స్వీకరణలి

**బలగం టీవీ, హైదరాబాద్**





జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీగా శ్రీ శేషాద్రిని రెడ్డి ఐపీఎస్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను ను అందజేశారు.

# ఏబీపీ నెట్‌వర్క్ 'సదరన్ రైజింగ్ సమ్మిట్ 2025'లో ప్రసంగించనున్న కేటీఆర్

- చెన్నై వేదికగా దక్షిణ భారతదేశ భవిష్యత్తుపై నవంబర్ 25న కేటీఆర్ ప్రసంగం

**బలగం టీవీ, హైదరాబాద్**




బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించనున్న ప్రతిష్టాత్మక 'సదరన్ రైజింగ్ సమ్మిట్ 2025' లో ప్రసంగించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక సదస్సు నవంబర్ 25, 2025న చెన్నైలోని ఐటీసీ గ్రాండ్ చోళాలో జరగనుంది. ఈ సదస్సులో కేటీఆర్ వేదికపై జరిగే చర్చా కార్యక్రమంలో పాల్గొని, దక్షిణ భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక మరియు సాంకేతిక పరిణామాలపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.

కేటీఆర్ ఈ సందర్భంగా తెలంగాణ సాధించిన ప్రగతి, భారతదేశ వృద్ధిలో దక్షిణ రాష్ట్రాల పాత్ర, అలాగే తయారీ, ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు ఆవిష్కరణల ఆధారిత రంగాలలో వస్తున్న కొత్త అవకాశాలపై తమ విశ్లేషణను అందిస్తారు. 'సదరన్ రైజింగ్ సమ్మిట్' యొక్క మూడవ ఎడిషన్ ఈసారి "భవిష్యత్తుకు సిద్ధం: ఆవిష్కరణ, పరివర్తన, స్ఫూర్తి" (Ready for the Future: Innovation, Transformation, Inspiration) అనే ఇతివృత్తంతో జరగనుంది. ఆర్థిక వృద్ధి, ఆరోగ్యం, విద్య, మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం, మరియు స్థిరమైన అభివృద్ధి వంటి అంశాలలో దక్షిణ రాష్ట్రాలు ఏ విధంగా ముందుకు సాగుతున్నాయో చర్చించడానికి ప్రభుత్వ ప్రతినిధులు, పరిశ్రమలు మరియు పౌర సమాజానికి చెందిన ప్రముఖులను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకురానుంది.

ఏబీపీ నెట్‌వర్క్ ఆహ్వానం ప్రకారం, కేటీఆర్ వంటి నాయకులు పాల్గొనడం తెలంగాణకే కాకుండా, యావత్ భారతదేశానికి విషను నిర్దేశించడంలో దోహదపడుతుందని పేర్కొంది. ఈ కార్యక్రమంలో కేటీఆర్ తెలంగాణ సాధించిన ప్రగతి, భారతదేశ వృద్ధిలో దక్షిణ రాష్ట్రాల పాత్ర, అలాగే తయారీ, ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు ఆవిష్కరణల ఆధారిత రంగాలలో వస్తున్న కొత్త అవకాశాలపై తన అభిప్రాయాలను పంచుకోనున్నారు.

## సిరిసిల్ల సబ్ డివిజన్ డీఎస్పీగా నాగేంద్రచారి బాధ్యతల స్వీకరణ



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల సబ్ డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా నాగేంద్ర చారి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సిరిసిల్లలోని డిఎస్పీ కార్యాలయంలో ఆయన లాంఛనంగా బాధ్యతలు చేపట్టారు.

**ఎస్సై నుంచి డిఎస్పీగా**

సిరిసిల్ల నూతన డిఎస్పీగా నాగేంద్ర చారి.. సిరిసిల్ల ప్రజలకు సుపరిచితుడే..! జిల్లాలో వివిధ హెూదాల్లో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. 1997లో ప్రొబేషనరీ ఎస్సైగా తన కెరీర్‌ను ప్రారంభించిన నాగేంద్ర చారి, సిరిసిల్ల జిల్లా పరిధిలో అనేక ముఖ్యమైన పదవులను సమర్ధవంతంగా నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట ఎస్సైగా 2004 లో విధులు నిర్వహించారు. అనంతరం 2010 లో గంభీరావుపేట ఎస్సైగా పనిచేసి మరో చోటుకు వెళ్లి 2013 సంవత్సరంలో సిరిసిల్ల సిఐగా విధులు నిర్వహించారు. అనంతరం 2022లో వేములవాడ డిఎస్పీగా విధులు నిర్వహించి జిల్లా నిజామాబాద్ సిసిఎస్%డ% స్టార్ స్పోర్ట్స్ ఏసీబీ గా పనిచేస్తుండగా ఆయన తాజా బదిలీపై ఆదివారం రోజున సిరిసిల్ల డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

## సిరిసిల్ల నూతన డీఎస్పీకి అభినందనలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన డీఎస్పీగా నియమితులైన నాగేంద్రచారి ని ఆదివారం కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ ఫిరోజ్ పాషా, ఫ్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు డీఎస్పీ నాగేంద్రచారి కి పుష్పగుచ్ఛం అందించి, నూతన బాధ్యతల నిర్వహణకు గాను శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని నాయకులు ఈ సందర్భంగా డీఎస్పీకి తెలిపారు. నూతన డీఎస్పీ నాగేంద్రచారి కూడా వారిని అభినందించి, జిల్లా ప్రజల భద్రతకు, శాంతియుత వాతావరణానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



## బోయినీపల్లి మండల జేసీబీ యూనియన్ నియామకం

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని పోచమ్మ దేవాలయ ఆవరణలో బోయినీపల్లి మండల జెసిబి యూనియన్ పాలకవర్గమును నియమించుకున్నారు. అధ్యక్షులుగా సంబ లక్ష్మీరాజం బోయినీపల్లి, ఉపాధ్యక్షులుగా కొండం శ్రీనివాసరెడ్డి నీలోజిపల్లి, ప్రధాన కార్యదర్శి డబ్బు సృజన్ రెడ్డి కోరేం, కోశాధికారి బండారి నవీన్ విలాసాగర్, సంయుక్త కార్యదర్శి ఒల్లేపు రాజకుమార్? లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సంబాలక్ష్మీ రాజం మాట్లాడుతూ.. నన్ను ఎన్నుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు అని తెలిపారు. అందుబాటులో ఉండి అందరికీ సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.



## ఇందిరమ్మ కాలనీలో మహిళా శక్తి చీరల పంపిణీ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జి గడ్డం మధుకర్ (చోటు) ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీ గ్రామంలో మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా గడ్డం మధుకర్ మాట్లాడుతూ.. మహిళలు శక్తి స్వరూపులని, ఎన్ని సమస్యలు ఎదురైనా వాటిని అధిగమించి, స్వయం సహాయక సంఘాల ద్వారా సంఘటితమై, ప్రభుత్వ సహకారంతో వ్యాపార రంగంలో కూడా రాణిస్తున్నారని ప్రశంసించారు. ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తుందని చెబుతూ.. ఇప్పుడు 15-18 ఏండ్ల కిశోర బాలికలకు, 60 ఏండ్ల వయసు పైబడిన వారికి కూడా సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం కల్పించిందని తెలిపారు. అంతేకాక, సంఘాల్లోని మహిళలకు ప్రభుత్వం రుణ బీమా మరియు ప్రమాద బీమా అమలు చేస్తోందని వెల్లడించారు. ఇందులో భాగంగా, రూ. రెండు లక్షల వరకు రుణ బీమా, మరియు రూ. 10 లక్షల చొప్పున ప్రమాద బీమా మంజూరు చేసిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కొంపల్లి శ్యామ్ తో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు గడ్డం రచన, ఏళ్ల సుజాత, కూచన రేఖ, తుమ్మ పద్మ, వీఓ సామల లాస్య, మహిళా సంఘం అధ్యక్షురాళ్లతో పాటు, మహిళా పొదుపు సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఈ సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్న ప్రజా ప్రభుత్వానికి పొదుపు సంఘాల మహిళలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- **జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**
- **గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 32 ఫిర్యాదులు స్వీకరణ**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 32 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## ఆటో కార్మికులకు కేటీఆర్ అండ..



- **రూ. 5 లక్షల ప్రమాద బీమా**
- **కేటీఆర్ సొంత డబ్బులతో బీమా**
- **పాలభిషేకంతో కృతజ్ఞత తెలిపిన ఆటో యూనియన్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నేత, రాజన్న సిరిసిల్ల జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు బొల్లి రామ్మోహన్ మండిపడ్డారు. ఆటో కార్మికుల అవస్థలను గుర్తించిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, తన సొంత డబ్బులతో జిల్లాలోని 5 వేల మంది ఆటో కార్మికులకు రూ. 5 లక్షల ప్రమాద బీమాను ప్రకటించడంపై రామ్మోహన్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల బీమా పథకాన్ని విస్మరించి, ప్రీమియం చెల్లించకపోవడంతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో కేటీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో సంతోషించదగ్గ విషయమని ఆయన అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు అండగా నిలబడి, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బొల్లి రామ్మోహన్ డిమాండ్ చేశారు.

కేటీఆర్ ఉదారతకు కృతజ్ఞతగా, తంగళ్ళపెల్లి మండలం జిల్లెల్ల మరియు కోనరావుపేట మండల కేంద్రాలలో ఆటో యూనియన్ అధ్యక్షులు, సభ్యులు మరియు కార్మికులు కేటీఆర్ చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు బొల్లి రామ్మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, ఆటో యూనియన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కూడా పాల్గొన్నారు.




## మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోజు (23-11-2025) న మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 25 మంది విజేత క్రీడాకారులకు ట్రాక్ సూట్లను పంపిణీ చేశారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన ఈ క్రీడాకారులు రాబోయే డిసెంబర్ 13 మరియు 14 తేదీలలో కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో జిల్లాను ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంగ స్వామి యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులకు క్యాష్ అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల శేఖర్ విజేత క్రీడాకారులకు ట్రాక్ సూట్లను అందజేశారు. ఈ పోటీలకు సహకరించిన, ముఖ్యంగా ట్రాక్ సూట్లను విరాళంగా అందించిన ఏ. రవి రెడ్డి (సినీ నిర్మాత), హైదరాబాద్ అసోసియేషన్ అందించిన సహకారానికి అసోసియేషన్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడికి చిలుముల జయవర్ధన్ శుభాకాంక్షలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా నియమితులైన సంగీతం శ్రీనివాస్ ని చిలుముల జయవర్ధన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిలుముల జయవర్ధన్ కుటుంబ సన్నిహితులు సంగీతం శ్రీనివాస్ ని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ పార్టీని మరింత బలోపేతం చేస్తారని, జిల్లాలో కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సంగీతం శ్రీనివాస్ కి అత్యంత సన్నిహితులుగా ఉన్న చిలుముల జయవర్ధన్, నూతన బాధ్యతల్లో ఆయన విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

# కబడ్డీ ప్రపంచ కప్ విజేత భారత్



- 35-28 తేడాతో చైనీస్ తైపీపై విజయం
- వరుసగా రెండో ప్రపంచకప్

**బలగం టీవీ, హైదరాబాద్**

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరిగిన మహిళల కబడ్డీ ప్రపంచ కప్ ఫైనల్లో భారత్ 35–28 తేడాతో చైనీస్ తైపీపై నెగ్గి చాంపియన్‌గా నిలిచింది. టోర్నీలో భారత జట్టు గ్రూప్ దశలో నాలుగు మ్యాచ్‌లను ఏకపక్షంగా గెలిచింది. అనంతరం సెమీఫైనల్లో పటిష్ఠమైన ఇరాన్‌పై 33–21తో విజయం సాధించి ఫైనల్ బెర్త్ దక్కించుకుంది.

ఫైనల్ మ్యాచ్ ప్రారంభంలో చైనీస్ తైపీ రైడర్లు దూకుడుగా ఆడి భారత రక్షణపై ఒత్తిడి తెచ్చినాఅనుభవం, క్రమశిక్షణతో కూడిన భారత జట్టు సమయోచిత టాకిల్స్, సమతుల్య రైడింగ్‌తో మ్యాచ్‌ను తన పక్షానకు తిప్పుకుంది. కీలక సమయాల్లో సంయమనం పాటించిన భారత క్రీడాకారిణులు పాయింట్లను దక్కించుకుంటూ చివరికి టైటిల్‌ను ఖాయం చేశారు.

ఈ విజయంతో భారత మహిళల కబడ్డీ జట్టు వరుసగా రెండో ప్రపంచ కప్ కిరీటాన్ని సాధించింది. ఈ సారి జరిగిన ప్రపంచ కప్‌లో మొత్తం 11 దేశాలు పాల్గొనడం కబడ్డీ క్రీడ విస్తృతమైన అంతర్జాతీయ ఆదరణను ప్రతిబింబిస్తోంది.

**మూడు ప్రపంచ టైటిళ్లతో చరిత్ర సృష్టించిన భారత్**

గత 30 రోజుల్లో భారత మహిళా జట్లు క్రికెట్, బ్లైండ్ టి20, కబడ్డీ విభాగాల్లో వరుస విజయాలు సాధించి దేశానికి అరుదైన హ్యాట్రిక్‌ను అందించారు. భారత మహిళల నిరూపణలతో క్రీడా రంగం ఉత్సాహభరితంగా మారింది.

**ప్రధాని మోదీ అభినందనలు**

భారత మహిళల కబడ్డీ జట్టు ప్రపంచ కప్–2025ను గెలుచుకున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు."కబడ్డీ వరల్డ్ కప్‌ను గెలిచి దేశ గౌరవాన్ని మరింత పెంచిన మహిళల కబడ్డీ జట్టు అందరికీ హృదయపూర్వక అభినందనలు," అని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు. అదనంగా, జట్టు ప్రదర్శించిన క్రీడా స్ఫూర్తి, పట్టుదల ప్రత్యేకంగా అభినందించదగ్గదని ఆయన అన్నారు.



# ఓటమి దిశగా టీమిండియా

**బలగం టీవీ, కేప్‌టౌన్**

భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో సౌతాఫ్రికా పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం సాధించిన ఈ వరల్డ్ ఛాంపియన్, బౌలింగ్‌లోనూ అదే దూకుడు కొనసాగించి భారత్‌ను కుప్పకూల్చింది. ఫాలో ఆన్ కూడా తప్పించుకోని భారత్ ప్రస్తుతం ఘోర పరాజయం దిశగా సాగుతోంది. అద్భుతం జరిగితే తప్ప ఓటమి తప్పదనే పరిస్థితి ఏర్పడింది.

**308 పరుగుల ఆధిక్యంలోకి సౌతాఫ్రికా**

భారత్‌ను ఫాలో ఆన్ ఆడించకుండానే, 288 పరుగుల భారీ ఆధిక్యంతో సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 8 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 26 పరుగులు చేసింది.ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ (13 బ్యాటింగ్), ఎయిడెన్ మార్క్‌రమ్ (12 బ్యాటింగ్) జాగ్రత్తగా ఆడి మూడో రోజు ఆటను ముగించారు. దీంతో సౌతాఫ్రికా మొత్తం ఆధిక్యం 314 పరుగులకు చేరింది.

**పేలవ బ్యాటింగ్‌తో భారత్ 201కు ఆలౌట్**

9/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటని ప్రారంభించిన భారత్%ా% మొదటి సెషన్ మొదలుకొని వరుసగా వికెట్లు కోల్పోతూ పతనమైంది.తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 201 పరుగులకే ఆలౌట్ అయింది.టాప్ స్కోరర్లు:యశస్వి జైస్వాల్ ౧ 58 (97 బంతులు, 7 ఫోర్లు, 1 సిక్స్)వాషింగ్టన్ సుందర్ 48 (92 బంతులు, 2 ఫోర్లు, 1 సిక్స్) చేయగా మిగతా బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. కేఎల్ రాహుల్ (22), సాయి సుదర్శన్ (15), రిషభ్ పంత్ (7), ధ్రువ్ జురెల్ (0), నితీష్ కుమార్ రెడ్డి (10), రవీంద్ర జడేజా (6) నిరాశపర్చారు.కుల్దీప్ యాదవ్ (19)తో కలిసి సుందర్ 8వ వికెట్‌కు 72 పరుగులు జోడించాడు. భారత ఇన్నింగ్స్‌లో ఇదే అత్యధిక భాగస్వామ్యం. సుందర్ ఔటవ్వగానే భారత్ పతనం మొదలైంది. చివర్లో బుమ్రా%–%సిరాజ్ సహకారంతో 200 పరుగుల మార్క్ దాటింది.

**జాన్సెన్ ధాటికి భారత బ్యాటింగ్ చిత్తు**

సౌతాఫ్రికా బౌలర్లు భారత్ బ్యాటింగ్‌పై విరుచుకుపడ్డారు.మార్కో జాన్సెన్ 6/48, సిమన్ హర్మర్ 3/64, కేశవ్ మహరాజ్ 1 వికెట్ తీసుకున్నారు. జాన్సెన్ కుదుపులతో భారత్ తొలి సెషన్‌లోనే నాలుగు వికెట్లు కోల్పోయింది.

ఫాలో ఆన్ ఇచ్చే అవకాశాన్ని వదిలేసి, రెండో ఇన్నింగ్స్‌లో భారీ లక్ష్యానికి పునాది వేసిన సౌతాఫ్రికా నాలుగో రోజు తొలి సెషన్ మొత్తం బ్యాటింగ్ చేయాలని యోచిస్తోంది. ప్రస్తుతం 314 పరుగుల ఆధిక్యంలో ఉన్న ప్రోటియాస్, మరో 100 పరుగులు చేసి ఇన్నింగ్స్ ప్రకటించే అవకాశం ఉంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి తప్పించుకోవాలంటే: నాలుగో రోజు మిగిలిన ఆటను అలాగే ఐదో రోజు పూర్తి సెషన్‌లను బ్యాటింగ్‌తో నెట్టుకుపోవాల్సిందే. ప్రస్తుత దశలో ఇది టీమిండియాకు అత్యంత క్లిష్టమైన సవాల్‌గా మారింది.

# నిఖిల్ స్వయంభు విడుదల తేదీ ఖరారు

**2026 ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్**

హీరో నిఖిల్ సిద్ధార్థ ప్రధాన పాత్రలో రూపొందుతున్న పీరియడ్ వార్ యాక్షన్ డ్రామా 'స్వయంభు' విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. కొంతకాలంగా ఎలాంటి అప్డేట్ రాకపోవడంతో నిరాశలో ఉన్న అభిమానులకు మేకర్స్ ఈ రోజు సర్‌ప్రైజ్ ఇచ్చారు. 2026 ఫిబ్రవరి 13న సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

**ఎనిమిది భాషల్లో పాన్-వరల్డ్ రిలీజ్**

మొదటిసారి దర్శకుడిగా మారుతున్న భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహించిన ఈ భారీ ప్రాజెక్ట్, తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషల్లో విడుదల కానుండటం విశేషం. సినిమా షూటింగ్ పూర్తయిందని, పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉందని యూనిట్ వెల్లడించింది.

**'రైజ్ ఆఫ్ స్వయంభు' వీడియోతో హైప్ పెరిగింది**

విడుదల తేదీని ప్రకటిస్తూ, మేకర్స్ ప్రత్యేక వీడియో 'రైజ్ ఆఫ్ స్వయంభు'ను విడుదల చేశారు. ఈ వీడియోలో భారీ యుద్ధ సన్నివేశాలు, పీరియడ్ ఎపిక్ సెట్లు, గ్రాండ్ విజువల్స్, నిఖిల్ ఇంటెన్స్ లుక్ వంటి అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ అవుతూ, చిత్రంపై ఉన్న హైప్ మరింత పెరిగింది.

సినిమాలో సమ్యుక్తా మరియు నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇద్దరి పాత్రలు ప్రత్యేకంగా డిజైన్ చేశారని సమాచారం. నిర్మాతలు: భువన్, శ్రీకర్ (పిక్సెల్ స్టూడియోస్), ప్రెజెంటర్: టాగూర్ మధు, సినిమాటోగ్రఫీ: కె.కె. సెంథిల్‌కుమార్, సంగీతం: రవి బస్రూర్




ఎపిక్ యాక్షన్ డ్రామాలకు పేరుగాంచిన సెంథిల్‌కుమార్ విజువల్స్, రవి బస్రూర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ చిత్రానికి ప్రధాన బలం కానున్నాయి.

**ప్రమోషన్లకు సిద్ధమవుతున్న టీమ్**

విడుదల తేదీ అధికారికంగా తెలిసిన నేపథ్యంలో, ప్రమోషన్లను పెద్ద ఎత్తున ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. 2026 ఫిబ్రవరి వరకు కొత్త పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్లు వరుసగా విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు మేకర్స్ తెలిపారు. పాన్-వరల్డ్ విడుదల, భారీ సెట్‌లు, యాక్షన్ ఎపిక్ కథ నేపథ్యంలో 'స్వయంభు' నిఖిల్ కెరీర్‌లోనే అతి భారీ ప్రాజెక్ట్‌గా భావిస్తున్నారు.

# జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు మారుతి క్షమాపణలు

**బలగం టీవీ, హైదరాబాద్**



'రాజాసాబ్' సినిమా ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన వివాదానికి దర్శకుడు మారుతి స్పందించారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు క్షమాపణలు తెలుపుతూ, ఎవరినీ అగౌరవపరచాలనే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం నగరంలోని విమల్ థియేటర్‌లో 'రాజాసాబ్' ఫస్ట్ సింగిల్ లాంచ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన మారుతి ౧ "ఈ సినిమా తర్వాత 'కాలర్ ఎగరేసుకుంటారు' వంటి మాటలు నేను చెప్పను. ప్రభాస్ లాంటి కటౌట్‌కు అవి చిన్న మాటలు" ౧ అని అన్నారు. ఆయన వ్యాఖ్యలు ఎన్టీఆర్ అభిమానుల్లో ఆగ్రహం రేగేలా చేశాయి. 'కాలర్ ఎగరేయడం' అన్న పదం తమ హీరోకు ప్రత్యేకంగా అనుసం ధానమైందని భావించిన అభిమానులు సోషల్ మీడియాలో మారుతిపై ట్రోలింగ్ ప్రారంభించారు. ఈహైప్ పెరిగి ప్రభాస్–ఎన్టీఆర్ అభిమానుల మధ్య మాటల యుద్ధం రాజేసిన నేపథ్యంలో, పరిస్థితిని సర్దుబాటు చేసే ప్రయత్నంగా మారుతి తన ఎక్స్ ఖాతా ద్వారా క్షమాపణలు తెలిపారు."ఎన్టీఆర్ గారి ప్రతి అభిమానికి హృదయపూర్వక క్షమాపణలు. ఎవరినీ బాధపెట్టడం నా ఉద్దేశం కాదు. కొన్నిసార్లు ఉత్సాహంలో చెప్పిన మాటలు తప్పుగా అర్థం కావచ్చు. నా వ్యాఖ్యల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే చింతిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ పట్ల, ఆయన అభిమానుల పట్ల తనకున్న గౌరవాన్ని మరోసారి గుర్తుచేస్తూ, ఈ వివాదం ఇక్కడితో ముగుస్తుందని ఆశిస్తున్నట్లు మారుతి వెల్లడించారు.

# పతంగ్‌కు సురేష్ ప్రొడక్షన్స్ అండ



- డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

నూతన ప్రతిభను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుండే ప్రముఖ నిర్మాత డి. సురేష్ బాబు తాజాగా 'పతంగ్' చిత్ర బృందంతో చేతులు కలిపారు. సురేష్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

ఇటీవల ప్రత్యేక ప్రదర్శనలో చిత్రాన్ని వీక్షించిన సురేష్ బాబు, 'పతంగ్' టీమ్ పనితీరును అభినందించారు. సినిమా నచ్చడంతో సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై విడుదల చేయాలని ఆయన నిర్ణయించారు. పతంగుల పోటీ నేపథ్యంతో రూపొందుతున్న ఈ కామెడీ స్పోర్ట్స్ డ్రామా సినిమాటిక్ ఎలిమెంట్స్, రిషన్ సినిమాస్ పతాకాలపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి, నాని బండ్రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. ప్రణీత్ ప్రతిపాటి దర్శకుడు.

ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ప్రధాన తారలుగా నటిస్తున్నారు. ప్రముఖ గాయకుడు–నటుడు ఎస్.పి. చరణ్ ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు. పలు నూతన నటీనటులు కూడా ఇందులో భాగమయ్యారు.

నిర్మాతలు మాట్లాడుతూ "సురేష్ ప్రొడక్షన్స్ సమర్పణలో మా చిత్రం విడుదల కావడం మా అదృష్టం. థియేటర్‌లో ఇది ఓ యూత్ ఫెస్టివల్‌లా ఉంటుంది. కొత్తవారితో చేసినా సినిమా క్వాలిటీ పెద్ద సినిమాలకు ఏమాత్రం తగ్గదు. కథే ఈ చిత్రానికి హీరో. జోస్ జిమ్మి ఇచ్చిన సంగీతం ప్రత్యేక ఆకర్షణ. పాటలు వినగానే పాజిటివ్ వైబ్స్ కలుగుతాయి" అని తెలిపారు.

అలాగే "పతంగుల పోటీని ఆస్వాదించేలా మొత్తం సినిమా ఉత్సాహభరితంగా సాగుతుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. కొత్త కంటెంట్‌కు ఆదరణ ఇచ్చే తెలుగు ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని తప్పకుండా ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాం. డిసెంబర్ 25న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం" అని అన్నారు.

# ద్రౌపది 2'లో రక్షణ ఇందుచూడన్ ఫస్ట్ లుక్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**




నటుడు రిచర్డ్ రిషి ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ద్రౌపది 2' నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న రక్షణ ఇందుచూడన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో ఆమె ద్రౌపది దేవి పాత్రలో అద్భుతంగా కనిపిస్తోంది. సోల్ చక్రవర్తి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని నేతాజీ ప్రొడక్షన్స్, జిఎం ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థలు నిర్మించగా, దర్శకత్వం మోహన్ జి వహిస్తున్నారు. విడుదలైన పోస్టర్‌లో రక్షణ ఇందుచూడన్ అధ్భుతమైన గాంభీర్యంతో దర్శనమిచ్చింది. ఆమె ధరించిన సంప్రదాయ ఆహార్యం, అలంకరణ పాత్రకు ప్రత్యేక శోభను తెచ్చాయి. పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే భారీ సెట్ సినిమా నిర్మాణ విలువలను మరింత పెంచుతూ, చిత్రాన్ని ఎంత గ్రాండ్ లెవెల్‌లో తీస్తున్నారో స్పష్టంగా తెలియజేస్తోంది. చిత్రబృందం తెలిపిన వివరాల ప్రకారం ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలియజేశారు. ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. ఫిలిప్ ఆర్. సుందర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, యాక్షన్ సన్నివేశాలను యాక్షన్ సంతోష్ రూపొందిస్తున్నారు. దేవరాజ్ ఎస్ ఎడిటింగ్, ఎస్.కే ఆర్ట్ డైరెక్షన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.